సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



ఉన్నత లక్ష్యాలను..

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు.

- 8లో ▸



రైతులు నానో యూరియా..

ద్రవరూపంలో ఉండే నానో యూరియాను వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవింద్ రైతులకు సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.2 /22.3

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సుభాష్‌నగర్ : నిజామాబాద్ నగరంలోని గంగాస్థాన్ డీ – 5 సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు టౌన్ – 2 ఏడీఈ ఆర్ ప్రసాద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ–2, 3, 5 సెక్షన్‌లతోపాటు సుభాష్‌నగర్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు ఏమైనా ఉంటే విన్నవించుకోవాలని సూచించారు. సమావేశానికి వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ హాజరై ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రసాద్‌రెడ్డి కోరారు.

నేడు పీసీసీ చీఫ్ పర్యటన



నిజామాబాద్ సిటీ: పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నగరంలోని బృందావన్ గార్డెన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో జరిగే 'గురుపూజోత్సవం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మధ్యాహ్నం తర్వాత ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమావేశమవుతారు. శనివారం కూడా మహేశ్ కుమార్ గౌడ్ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని విపుల్ గౌడ్ తెలిపారు.

'నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలి'



కామారెడ్డి టౌన్: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో జరిగిన స్కిల్ ప్లస్ కార్యక్రమంలో లార్వెన్ ఏఐ స్టూడియో ఫౌండర్ దిల్ రాజు బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ సినీ రంగంపై ఆసక్తి ఉండి అటువైపు అడుగులు వేయాలనుకుంటున్న విద్యార్థులకు లార్వెన్ ఏఐ స్టూడియో ద్వారా ఏఐ, వీఎఫ్‌ఎక్స్‌లలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీతో పాటు వివిధ మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగాలను పొందిన కళాశాల విద్యార్థులను అభినందించారు.

కార్యక్రమంలో దిల్ రాజు సతీమణి లార్వెన్ కోఫౌండర్ వైగా రెడ్డి, ఆయా కంపెనీల సీఈవోలు రక్షిత్ రెడ్డి, మనీష్, సాయి కిరణ్, దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధులు శేఖర్, శ్రీకాంత్, సాందీపని కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్‌రెడ్డి, ప్రిన్సిపల్ సాయిబాబు పాల్గొన్నారు.

కామారెడ్డి ఆర్టీసీ డీఎంగా దినేశ్ కుమార్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పి.దినేశ్ కుమార్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ డీఎంగా పనిచేసిన కరుణశ్రీ హైదరాబాద్–2 డిపోకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో ప్రస్తుతం ఖమ్మం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న దినేశ్ కుమార్ బదిలీపై వస్తున్నారు. ఆయన ఈనెల 22న విధుల్లో చేరనున్నారు. దినేశ్ కుమార్ గతంలో ఇక్కడే ఆర్టీసీ సీఐగా విధులు నిర్వహించారు.

ప్రక్షాళన జరిగేనా!

- కార్పొరేషన్‌లో రివ్యూలు నిర్వహిస్తూ అధికారులను పరిగెత్తిస్తున్న జిల్లా కలెక్టర్
- రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్‌పై దృష్టి
- పెండింగ్ ఫైళ్లపై ఆరా
- బల్దియా సిబ్బందిలో వణుకు



నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగాలపై ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో ప్రత్యేకాధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. తరచూ సమీక్షలు ఏర్పాటు చేస్తూ బల్దియా అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. రెవెన్యూ పెండింగ్ ఫైళ్లను బయటికి తీయించిన ఆయన.. వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలోనైనా బల్దియాలో ప్రక్షాళన సాధ్యమవుతుందా అని నగరవాసులు అంటున్నారు.

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలపై ప్రత్యేకాధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కార్పొరేషన్‌కు నేరుగా వస్తూ తరచూ సమీక్షలు నిర్వహిస్తూ ప్రతి ఫైల్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకుంటుండడంతో బల్దియా అధికారుల వెన్నులో వణుకుపుడుతోంది. కోర్టు పరిధిలో ఉన్న కేసుల వివరాలను సైతం తెలుసుకుంటున్నారు. కార్పొరేషన్‌లో తరచూ రివ్యూలు నిర్వహిస్తున్న కలెక్టర్.. పెండింగ్ ఫైళ్లన్నీ బయటికి తీయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సుమారు 2వేల వరకు ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించిన కలెక్టర్.. వాటిని వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. బుధవారం సైతం రివ్యూ నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫైళ్లు పెండింగ్‌లో లేకపోవడంపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్.. అనుమతులు లేకుండా బిల్డింగ్‌ల నిర్మాణం, ఆక్రమణల ప్రోత్సాహం, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ల పనితీరుపై అదే సమయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు.



పెండింగ్ ఫైళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

ఫైళ్లకు మోక్షం

బల్దియా అధికారులను కలెక్టర్ పరుగులు పెట్టిస్తుండడంతో గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ ఫైళ్లకు ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. సుమారు 2 వేల ఫైళ్లను బయటికి తీసిన అధికారులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది మొత్తం గురువారం నుంచి వారం రోజులపాటు ఈ ఫైళ్ల క్లియరెన్స్ పనిలో ఉండనున్నట్లు తెలిసింది.

ట్రేడ్ లైసెన్స్‌లపై దృష్టి సారిస్తే..

ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలున్నాయి. షాపింగ్‌మాల్స్, పెద్ద వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోకుండానే వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. ఖలీల్‌వాడి, హైదరాబాద్ రోడ్డు వంటి ప్రధాన ప్రాంతాల్లో కార్పొరేట్ ఆస్పత్రులను ఎన్‌వోసీలు లేకుండానే ప్రారంభిస్తున్నారు.

హైదరాబాద్ రోడ్డులో ఇటీవల కొత్తగా వెలిసిన వస్త్రదుకాణం నుంచి ఫీజుతోపాటు మరో రూ.లక్ష అదనంగా తీసుకుని అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. కలెక్టర్ దీనిపై దృష్టి సారిస్తే బల్దియాకు ఆదాయం సమకూరడంతోపాటు అవినీతి అధికారుల ఆటలకు అడ్డుకట్ట పడుతుందని నగరవాసులు అంటున్నారు.

రెవెన్యూలో..

బల్దియాకు గుండెకాయ వంటి విభాగమైన రెవెన్యూ సెక్షన్‌లో పైసలివ్వనిదే పని కావడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితిపై పలువురు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. అయితే కలెక్టర్ కార్పొరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో రెవెన్యూ సెక్షన్ ప్రక్షాళనకు కమిషనర్ దిలీప్ చర్యలు చేపట్టారు. ముందుగా రెవెన్యూ ఆఫీసర్ ఖయ్యూమ్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు మార్చి ఆయన స్థానంలో సీనియర్ అసిస్టెంట్ స్వప్నను ఆర్‌వోగా నియమించారు. అలాగే ఆర్‌ఐ బాధ్యతలను సీనియర్ అసిస్టెంట్ అనురాధకు అప్పగించారు.

ఫైళ్లు క్లియర్ చేస్తున్నాం



రెవెన్యూ విభాగంలో కొన్ని నెలలుగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించాం. సరైన పత్రాలున్న వాటిని క్లియర్ చేయాలని డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించాం. అనుమతుల్లో సమస్యలుంటే వెంటనే దరఖాస్తుదారుకు సమాచారం ఇవ్వాలని సూచించాం. బల్దియా పాలనా వ్యవహారాలను ఎప్పటికప్పుడు ప్రత్యేకాధికారి, కలెక్టర్ నోటీసులో ఉంచుతున్నాం.

– దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మాటల తూటాలు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డిపై పోచారం భాస్కర్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- ప్రశాంత్‌రెడ్డి మంత్రిగా ఉండి పూర్తిగా విఫలమయ్యారంటూ విమర్శలు
- వెన్నుపోటుతో డీసీసీబీ పీఠం నుంచి తనను దించారంటూ ఆరోపణలు
- వైఎస్‌ఆర్ ముఖం చూసి బాజిరెడ్డిని గెలిపించారంటూ ఎద్దేవా..



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మడి జిల్లాలో మాటల తూటాలతో రాజకీయం గరంగరంగా మారింది. డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తాజాగా చేసిన ప్రసంగం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. బాన్సువాడ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి చేసిన విమర్శలకు ప్రతిగా భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఎవరేమిటో తేల్చుకుందామంటూ భాస్కర్‌రెడ్డి సవాళ్లు విసిరాడు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి 'లక్ష్మీపుత్రుడు కాదు.. శనిపుత్రుడు' అంటూ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ భాస్కర్‌రెడ్డి విరుచుకుపడ్డారు. జీవన్‌రెడ్డి ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. 2018లో 36 వేల ఓట్ల ఆధిక్యంతో గెలిచిన జీవన్‌రెడ్డిని ప్రజలు గత ఎన్నికల్లో మూడోస్థానానికి నెట్టేశారన్నారు. జీవన్‌రెడ్డీ ఇదీ నీ బతుకు అంటూ వాఖ్యలు చేయడం గమనార్హం. నువ్వు జిల్లా అధ్యక్షుడిగా ఉండి ఎంతమంది ఎమ్మెల్యేలను గెలిపించావు అంటూ ప్రశ్నించారు. జీవన్‌రెడ్డిని ఇంటరాగేట్ చేస్తే అతను చేసిన అసాంఘిక కార్యకలాపాలను కక్కేస్తాడన్నారు. భారీగా డబ్బులు సంపాదించి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.

■ దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖం చూసి నాడు బాన్సువాడలో ప్రజలు బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించారని భాస్కర్‌రెడ్డి అన్నారు. 2014, 2018 ఎన్నికల్లో బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్, ఏనుగు రవీందర్‌రెడ్డిలు కలిసి మంత్రి పదవిపై కన్నేసి పోచారం శ్రీనివాసరెడ్డిని ఓడగొట్టేందుకు కుట్రలు చేశారన్నారు. ఏనుగు రవీందర్‌రెడ్డి ఏ ఎండకా గొడుగు పడుతున్నాడన్నారు.

■ వేముల ప్రశాంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా నుంచి మంత్రిగా ఉండి ఏం సాధించారంటూ ఎద్దేవా చేశారు. ప్రశాంత్ రెడ్డికి నిజామాబాద్ జిల్లాలో ఏ ఒక్క ఎమ్మెల్యే గౌరవం ఇవ్వలేదన్నారు. కామారెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేలు మాత్రమే గౌరవించారన్నారు. గత ఎన్నికల్లో కొద్ది తేడాతో ప్రశాంత్‌రెడ్డి గెలుపొందారన్నారు. ఒకే పార్టీలో ఉన్నప్పటికీ డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న తనను దించేందుకు చేసిన కుట్రలో భాగస్వామి అయ్యారన్నారు. ప్రశాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డికి పదవి కట్టబెట్టేందుకు తనకు వెన్నుపోటు పొడిచారన్నారు. పోచారం తండ్రిలాంటివారని చెప్పిన ప్రశాంత్ రెడ్డి, మరి పోచారం కొడుకుకే వెన్నుపోటు పొడవడమేమిటన్నారు. రమేష్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రశాంత్‌రెడ్డి సొంత ఊరు వేల్పూర్ సొసైటీలో అవిశ్వాసం పెట్టే అవకాశం ఉన్నప్పటికీ పెట్టలేదన్నారు. పార్టీకి సైతం వెన్నుపోటు పొడిచారన్నారు. ఇది వాస్తవం కాదా అని భాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిపై ఏ గుడికి వచ్చి చెప్పమన్నా చెబుతా.. బాల్కొండ నియోజకవర్గానికి రమ్మంటావా.. బాన్సువాడ నియోజకవర్గానికి వస్తావా అంటూ భాస్కర్‌రెడ్డి సవాల్ చేశారు. ఈ విషయమై హరీశ్‌రావు, కేటీఆర్‌కు చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. వర్ని మండలం సిద్ధాపూర్ సమావేశంలో పోచారం భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్నివర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. రానున్న రోజుల్లో ఈ మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశమున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం

- బోధన్‌లో ఘటన.. బయటే వేచి ఉన్న సబ్ రిజిస్ట్రార్
- 36 నెలలుగా అద్దె చెల్లించని వైనం
- ఉన్నతాధికారుల జోక్యంతో శాంతించిన యజమానులు



కార్యాలయానికి తాళం వేస్తున్న భవనం ఓనర్

బోధన్‌టౌన్(బోధన్): భవనం అద్దె 36 నెలలుగా చెల్లించకపోవడంతో యజమానులు గురువారం బోధన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం వేశారు. కార్యాలయానికి తాళం వేయడంతో చేసేది లేక సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సిబ్బంది బయటే నిలబడ్డారు. రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం అద్దె నెలకు రూ. 74 వేలు కాగా.. 36 నెలలకు సంబంధించి యజమానులకు రూ.26,64,000 చెల్లించాల్సి ఉంది. అద్దె చెల్లించాలని యజమానులు పలుమార్లు అడిగినా స్పందించకపోవడంతో గురువారం కార్యాలయానికి తాళం వేశారు. యజమానులు ఈ నెల 8వ తేదీన సబ్ రిజిస్ట్రార్‌కు నోటీసు సైతం అందించారు. ఈ ఘటనపై సబ్ రిజిస్ట్రార్ సాయిబాబాను వివరణ కోరగా.. అద్దె చెల్లించాల్సిన విషయం వాస్తవమేనని, ఉన్నతాధికారులకు వివరించామన్నారు. జిల్లా ఉన్నతాధికారులు భవన యజమానులతో మాట్లాడి అద్దె బకాయి చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో చివరకు తాళం తీశారు. దీంతో యథావిధిగా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ కొనసాగింది.

నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకురావాలి



కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నష్టాల్లో ఉన్న డీసీసీబీ శాఖలను లాభాల్లోకి తీసుకొచ్చేలా కృషి చేయాలని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి అన్నారు. నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయా బ్రాంచీల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. బ్యాంకు వ్యాపార కార్యకలాపాలు రూ.2400 కోట్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.2400 కోట్లలో రూ.787 కోట్లు డిపాజిట్లు, రూ.1613 కోట్ల రుణాలు ఉన్నాయని వివరించారు. ప్రతి ఉద్యోగి లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిబద్ధతతో పని చేయడంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. నష్టాల్లో ఉన్న శాఖలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో శాఖాధికారులకు దిశానిర్దేశం చేస్తున్న సీఈవో నాగభూషణం వందే, ఇతర ఉన్నతాధికారులను చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. డీజీఎంలు లింబాద్రి, అనుపమ, సుమమాల, గజానంద్, ఉన్నతాధికారులు, 63 బ్రాంచీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకర ఆహారం కోసం..



- అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ్ వాటిక
- చిన్నారులు, గర్భిణులకు తాజా, నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం
- జిల్లాలోని 300 కేంద్రాల్లో అమలు
- కేంద్రాలకు విత్తనాల పంపిణీ
- ఒక్కో సెంటర్‌కు రూ.10వేల వరకు ఖర్చు
- వెయ్యికిపైగా కేంద్రాల్లో స్థలాల కొరత

నిజామాబాద్‌నాగారం : అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తాజా, ఆరోగ్యకర పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో మొత్తం 1501 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 400 సెంటర్లకు సొంత భవనాలు ఉండగా.. కూరగాయల సాగు కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పోషణ్ వాటిక' (న్యూట్రి గార్డెన్) కార్యక్రమానికి 300 సెంటర్లను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలోని ఖాళీ స్థలాల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఒక్కో సెంటర్‌కు రూ.10 వేల చొప్పున నిర్వహణ నిధులు అందించనున్నారు.

జిల్లాకు చేరిన విత్తనాలు

పోషణ్ వాటికలో భాగంగా అంగన్‌వాడీ సెంటర్ల ఆవరణలో కూరగాయల సాగు కోసం ఇప్పటికే జిల్లాకు విత్తనాలు సరఫరా అయ్యాయి. రూ.500 ఖరీదు చేసే విత్తన ప్యాకెట్లు జిల్లా కార్యాలయానికి రాగా300 కేంద్రాలకు పంపిణీ చేశారు. ప్యాకెట్లలో పాలకూర, వంకాయ, తోట కూర, టమాట, చిక్కుడు విత్తనాలున్నాయి. సేంద్రియ పద్ధతిలో కూరగాయాలు సాగు చేయనున్నారు. ముందుగా ప్రతి సెంటర్‌కు రూ.2వేలు వెచ్చించి భూమి చదును చేయించనున్నారు. ఒక్కో సెంటర్‌కు మొత్తం రూ.10వేల వరకు ఖర్చు చేయనున్నారు.

గతంలో నెరవేరని లక్ష్యం

గతంలో అంగనవాడీ కేంద్రాలకు ఆకుకూరలు, కూరగాయలను కాంట్రాక్టర్లు సరఫరా చేసేవారు. సరఫరా బాధ్యతలు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యత లేని కూరగాయలు, ఆకుకూరలు అంటగట్టేవారు. దీంతో కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యం నెరవేరలేదు. అటు తర్వాతా అంగన్‌వాడీ టీచర్లే గత కొన్ని సంవత్సరాలుగా కూరగాయలు కొంటూ వంట చేయిస్తున్నారు. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు.

నిరాసక్తత..!

పోషణ్‌వాటిక కింద కూరగాయలు సాగు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం మంచిదే అయినా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని కొందరు అంగన్‌వాడీ టీచర్లు అంటున్నారు. సెంటర్ల చుట్టూ ప్రహరీలు లేకపోవడం, పని భారం అడ్డంకిగా మారుతుందని అంటున్నారు. కూర గాయలు, ఆకుకూరల సాగుకు ఇబ్బందులు తలెత్తుతాయని, పశువులు, కోతుల బెడదతో సాగు చేసే పరిస్థితి కనిపించడం లేదని నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	05
అంగన్‌వాడీ సెంటర్లు	1501
బాలింతలు	61,200
గర్భిణులు	9,821
చిన్నారులు	81,262

పక్కాగా అమలు చేస్తాం

పోషణ్‌వాటిక పథకానికి జిల్లాలోని 300 కేంద్రాలను ఎంపిక చేశారు. ఐదు రకాల విత్తనాల ప్యాకెట్లను సరఫరా చేయడం జరిగింది. పథకం అమలు బాధ్యత అంగన్‌వాడీ టీచర్లే చూసుకోవాల్సి ఉంటుంది. స్థలాల కొరత కారణంగా కొన్ని కేంద్రాల్లో అమలు చేయడం లేదు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు బలవర్ధక ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా పథకాన్ని పక్కాగా అమలు చేస్తాం.

– రసూల్‌బీ, జిల్లా సంక్షేమాధికారిణి

లక్షల క్యూసెక్కుల వరద

- ఓ దశలో 3లక్షల క్యూసెక్కులు దాటి..
- ఎస్సారెస్పీలోకి పోటెత్తిన ఇన్‌ఫ్లో
- 39 గేట్ల ద్వారా గోదావరిలోకి 1.85 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల



ఎస్సారెస్పీలో ప్రస్తుత నీటి మట్టం

బాల్కొండ: మహారాష్ట్రతోపాటు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద పోటెత్తింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 2 లక్షల 15 వేల క్యూసెక్కులుగా కొనసాగిన ఇన్‌ఫ్లో రాత్రికి లక్షా 92 వేలకు తగ్గింది. గురువారం ఉదయం 6 గంటలకు 2 లక్షల 48 వేల క్యూసెక్కులకు పెరిగింది. క్రమంగా పెరిగిన ఇన్‌ఫ్లో మధ్యాహ్నం సమయానికి 3 లక్షల 10 వేల క్యూసెక్కులకు చేరి సాయంత్రం వరకు అదే స్థాయిలో కొనసాగింది. రాత్రి సమయానికి 2.75లక్షలకు తగ్గింది. 39 వరద గేట్ల ద్వారా లక్షా 85 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ నీటిమట్టాన్ని అధికారులు భారీగా తగ్గించారు. వరద కాలువ ద్వారా 6,500 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, సరస్వతి కాలువ ద్వారా 400, లక్ష్మీ కాలువ ద్వారా 200, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.701 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతోంది.

కిటికీ చువ్వలు తొలగించి దొంగతనం

- 19 తులాల బంగారం..
- రూ.10 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీ ఎత్తుకెళ్లిన దుండగులు
- నిజామాబాద్ నగరంలో ఘటన



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి, ఎస్సై గంగాధర్

ఖలీల్‌వాడి: ఇంటి కిటికీ చువ్వ(గ్రిల్స్)లను స్క్రూ డ్రైవర్‌తో తొలిగించిన దుండగులు 19 తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.10 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని ఐదో టౌన్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బాబన్‌సాహెబ్ పహాడ్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బాబన్ సాహెబ్ పహాడ్‌కు చెందిన నిషాత్ ఆఫ్రిన్ భర్త సౌదీలో ఉంటున్నాడు. తన ఇద్దరు కుమారులతో కలిసి బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి ఆఫ్రిన్ అహ్మదీబజార్‌లో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లింది. రాత్రి వేళ ఇంటి కిటికీ చువ్వలను స్క్రూడ్రైవర్‌తో తొలగించి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బీరువాను ధ్వంసం చేసి అందులోని బంగారం, విదేశీ కరెన్సీని ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన ఆఫ్రిన్.. కిటికీ చువ్వలు తొలగించి ఉండడంతోపాటు బీరువాను గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి చోరీ జరిగిన ఇంటికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలను సేకరించారు. ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు. సీసీఎస్, ఐదో టౌన్ పోలీసులు రంగంలోకి దిగి నిందితుల కోసం గాలిస్తున్నారు. అయితే స్థానికులే చోరీ చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.



అంతర్రాష్ట్ర వంతెన సమీపంలో రోడ్డుకు అడ్డంగా డ్రమ్ములు, బారికేడ్లు

అంతర్రాష్ట్ర వంతెన పైనుంచి రాకపోకల నిలిపివేత

రెంజల్(బోధన్) : మహారాష్ట్రలోని విష్ణుపురి, గైక్వాడ్ ప్రాజెక్టులతోపాటు కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తుండడంతో గోదావరి, మంజీర నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కందకుర్తి త్రివేణి సంగమంలో వరద పోటెత్తుతోంది. అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకుని నీరు ప్రవహిస్తుండడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలను అధికారులు నిలిపివేశారు. గోదావరి నది పరీవాహక గ్రామాల్లో దండోరా వేయించారు. ప్రజలు, రైతులు, బర్ల, గొర్ల కాపరులు నది ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై చంద్రమోహన్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. పుష్కరక్షేత్రంలోని సీతారాం త్యాగి ఆశ్రమం నుంచి సీతారాం త్యాగి మహరాజ్‌తోపాటు ఆయన శిష్యులను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

క్లుప్తంగా

ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ డైరెక్టర్‌గా సత్యనారాయణరెడ్డి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి మావురపు సత్యనారాయణ రెడ్డి ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ డైరెక్టర్‌గా నియామకమయ్యారు. తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి గురువారం సత్యనారాయణరెడ్డికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో డైరెక్టర్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

గర్ల్స్ హాస్టల్ వార్డెన్‌గా జ్యోత్స్న

తెయూ ఇంగ్లిష్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎల్.జ్యోత్స్న గర్ల్స్ హాస్టల్ వార్డెన్‌గా నియామకమయ్యారు. వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి గురువారం ఆమెకు నియాకమ ఉత్తర్వులు అందజేశారు.

డీపీవో కార్యాలయ ఏవోగా రాజాబాబు



సుభాష్‌నగర్: జిల్లా పంచాయతీ కార్యాలయ పరిపాలనా అధికారి(ఏవో)గా రాజాబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజాబాబు పదోన్నతి పొందారు. డీపీవో కార్యాలయ ఏవో పోస్టు ఖాళీగా ఉండటంతో ఆయనకు జిల్లాలోనే కేటాయించారు. రాజాబాబును డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీవోలు శ్రీనివాస్, నాగరాజు, శివకృష్ణ, ఉద్యోగులు కృష్ణ, ఆదిత్య, నరహరి తదితరులు అభినందించారు.

జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడ: బోర్లం క్యాంపులో నిర్వహించే జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం డీఎస్పీ విఠల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో వాలీబాల్ టోర్నీ కొనసాగుతుందని, జిల్లాలోని వివిధ మండలాల క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు ధరావత్ రవి తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేల నగదుతో పాటు మెమొంటోలు అందజేస్తామని వారు తెలిపారు.

కేసుల విచారణ త్వరగా పూర్తిచేయాలి

- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి
- నెలవారీ సమీక్షా సమావేశంలో సీపీ సాయిచైతన్య



సమావేశంలో పాల్గొన్న ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: పోక్సో, గ్రేవ్ కేసుల్లో విచారణ త్వరితగతిన పూర్తిచేయాలని సీపీ పోతరాజు సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో పూర్తి పారదర్శకంగా విచారణ చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందజేయాలని సూచించారు. గ్రామ పోలీస్ అధికారులు ప్రతి రోజు గ్రామాన్ని సందర్శించి, ప్రజలతో మమేకమవుతూ నేర నియంత్రణకు కృషి చేయాలని పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాలలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

బ్లాక్‌స్పాట్లను గుర్తించాలి

ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయించాలని సీపీ సాయిచైతన్య సూచించారు. హైవే రోడ్లను కలుపుతూ ఉండే లింక్ రోడ్లకు స్పీడ్ బ్రేకర్స్ వేయించడం, రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించాలని తెలిపారు. నేషనల్ హైవే, స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని చెప్పారు. ప్రతిరోజు పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మాదకద్రవ్యాల సరఫరా, క్రయవిక్రయాలు, జూదం, రేషన్ బియ్యం అక్రమరవాణా లాంటి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. తరచూ ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్టు కోసం పంపాలని ఆదేశాలు జారీచేశారు. సమీక్షలో డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు రాజావెంకట్ రెడ్డి, జె. వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం ఉన్నారు.

సిబ్బందికి ప్రశంసాపత్రాలు

వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ పండుగలను శాంతియుతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందికి సీపీ సాయిచైతన్య అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన పలువురికి ప్రశంసా పత్రాలను అందజేశారు. వచ్చే దేవీ నవరాత్రి ఉత్సవాలు, దీపావళి పండుగలను ప్రజలందరూ శాంతియుతంగా నిర్వహించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఒకే పోర్టల్‌లో స్కాలర్‌షిప్‌లు

ఖలీల్‌వాడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లను ఒకే దగ్గర దరఖాస్తు చేసుకోవడానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నిర్ణయం తీసుకుంది. ఇది వరకు ఉన్న ఎన్ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్)ను అందుకు అనుకూలంగా మార్పు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాకుండా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల స్కాలర్‌షిప్‌ల కోసం ఇదే పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

దరఖాస్తు చేసుకోవడం ఇలా

ముందుగా ఎన్ఎస్‌పీ పోర్టల్‌లో అభ్యర్థి వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. వచ్చిన అప్లికేషన్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలి. కుల, ఆదాయ ధ్రువపత్రాలు, విద్యార్హతలు, మెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేసి వాటిని అప్‌లోడ్ చేయాలి. ఒకటో తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు చదివే అన్నివర్గాల విద్యార్థులు.. ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్, ఎంఎంఎస్ఎస్, టాప్‌క్లాస్ ఎడ్యుకేషన్(ఎస్సీ, ఎస్టీలకు), యూజీసీ, ఇషాన్, ఉదయ్, సింగిల్ గర్ల్ చైల్డ్, ఏఐసీటీఈ సెంట్రల్ సెక్టార్ స్కీం ఆఫ్ స్కాలర్‌షిప్ తదితర వాటన్నింటికీ ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ పోర్టల్ అక్టోబర్ 31 వరకు తెరిచి ఉంటుంది.

సమాచారం..

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న కలెక్టర్

వర్ని: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ప్రతి విద్యార్థి నిర్దేశించుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మోస్రా మండలంలోని చింతకుంట ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఏకాగ్రతతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని సూచించారు. అంకిత భావం, పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించుకోవచ్చని దిశానిర్దేశం చేశారు. చదువులో ఎలా రాణించాలి, పరీక్షల్లో ఎలా విజయం సాధించాలి, లక్ష్యానికి అనుకూలంగా సిలబస్‌ను ఏవిధంగా సకాలంలో పూర్తి చేయాలి, జీవితంలో ఉన్నత స్థితికి ఎదగడానికి ఏం చేయాలన్న దానిపై విద్యార్థులకు సలహాలు సూచనలు అందజేశారు. అంతకుముందు పాఠశాల, అంగన్‌వాడీల్లో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. మెనూ తప్పకుండా పాటించాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. ప్రైమరీ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవోను ఆదేశించారు.

రైతులు నానో యూరియా వాడాలి

డీఏవో మేకల గోవింద్



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీఏవో గోవింద్

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులంతా బస్తాల్లో లభించే యూరియా కాకుండా బాటిళ్లలో ద్రవరూపంలో ఉండే నానో యూరియాను వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవింద్ సూచించారు. గురువారం డొంకేశ్వర్ మండల కేంద్రానికి వచ్చిన ఆయన సొసైటీ గోదాములను పరిశీలించారు. ఎరువుల నిల్వలు, అమ్మకాలను రిజిస్టర్లలో తనిఖీ చేశారు. జిల్లాలో యూరియా కొరత ఏమాత్రం లేదని, రైతులు అవసరానికి మించి కొనుగోలు చేయకూడదన్నారు. యూరియాను ఎక్కువగా వినియోగించడంతో నేలకు, పంటలకు ప్రమాదమన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిన ఎలాంటి దుష్ప్రభావాలు లేని నానో యూరియాను వాడాలని సూచించారు. ఇది రెండు బస్తాలతో సమానమని, రైతులకు శ్రమ కూడా తగ్గుతుందన్నారు. అనంతరం నూత్‌పల్లిలో వరి పంటను పరిశీలించారు. సరిపడా ఎరువులు సరఫరా చేస్తున్నందుకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశరం భూమేశ్ రెడ్డి, రైతులు కలిసి డీఏవోను సన్మానించారు. మండల వ్యవసాయాధికారి మధుసూదన్, ఏఈవోలు మౌనిక, ప్రశాంత్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా టోర్నీకి ఎంపిక

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగే సీనియర్ పురుషుల, మహిళ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లను సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదారి సంజీవ్ రెడ్డి గురువారం ప్రకటించారు. పురుషుల విభాగంలో ఉదయ్ కుమార్, పవన్‌కల్యాణ్, శివకుమార్, సాత్విక్, పీర్‌సింగ్, మహిళల విభాగంలో శ్రీజ, శ్రేష్ఠ, పూజిత, భవ్యశ్రీ, లాస్య శ్రీ ఎంపికయ్యారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ కనబర్చాలని, జాతీయ జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు.

పలువురి బైండోవర్

ఇందల్వాయి: మండలంలోని మేఘ్యా నాయక్ తండా, త్రయంబక్‌పేట్, దేవుని తండా, గండి తండాల్లో భీంగల్ ఎక్సైజ్ అధికారులు, నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 8 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారు చేస్తున్న లంబాడి పాల్య, లాకవత్ లాలియా, బాదావత్ రమేశ్‌ను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ వెంకట్రావు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాధవరావు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది మహేశ్, దత్తాద్రి, స్రవంతి, జగదీశ్ పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

మోపాల్: దుబాయిలో గుండెపోటుతో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన తలారి సవీన్ మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరింది. ఆగస్టు 26న దుబాయిలో తలారి సవీన్ మృతి చెందగా, ఈనెల 12వ తేదీన కుటుంబసభ్యులకు సమాచారం అందిన విషయం తెలిసిందే. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అనంతరం సవీన్ అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చిన్నారులకు సరైన పోషణ అందించాలి



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ టీచర్లతో డీడబ్ల్యూవో రసూల్ బీ

- డీడబ్ల్యూవో రసూల్ బీ
- అంగన్‌వాడీ టీచర్లకు ముగిసిన శిక్షణ

డిచ్‌పల్లి: చిన్నారులకు సరైన పోషకాహారాన్ని అందించాలని, 0–5 సంవత్సరాల లోపు పిల్లల్లో ముందుగానే లోపాలను గుర్తించి తల్లిదండ్రులకు తగిన సలహాలు ఇచ్చి డాక్టర్‌కు రిఫర్ చేయాలని జిల్లా సంక్షేమాధికారిణి (డీడబ్ల్యూవో) రసూల్ బీ సూచించారు. డిచ్‌పల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు 'పోషణ్ బీ-పడాయి బీ' అనే అంశంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీడబ్ల్యూవో మాట్లాడుతూ 0–3 సంవత్సరాల లోపు పిల్లలకు నవచేతన ద్వారా ప్రేరణ కలిగించాలన్నారు. 3–6 సంవత్సరాల పిల్లలకు ఆథశిల ద్వారా ప్రీస్కూల్ విద్యను నేర్పించాలన్నారు. ఎత్తుకు తగ్గ బరువులో సాధారణ బరువు వచ్చే వరకు పోషకాహారం కొనసాగించాలన్నారు. దివ్యాంగ పిల్లలకు యూడీఐడీ కార్డులు ఇప్పించాలన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మానవతసదన్‌లో 92, నడిపల్లి రైతువేదిక లో 94, ధర్మారం(బి) రైతువేదికలో 97 మందికి శిక్షణ నిచ్చినట్లు సీడీపీవో జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మమత, బుజ్జి, శోభ, వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, రాధలక్ష్మి, సునీత, సరిత సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకొని స్వయం ఉపాధి పొందాలి

- ఎస్‌బీఐ ఏజీఎం రంజిత్‌కుమార్ నాయుడు



అభ్యర్థుల పనితీరు పరిశీలిస్తున్న ఎస్‌బీఐ ఏజీఎం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని ఎస్‌బీఐ ఏజీఎం (ఏవో, నిజామాబాద్) రంజిత్‌కుమార్ నాయుడు సూచించారు. డిచ్‌పల్లి ఆర్ఎస్ఈటీఐను గురువారం ఆయన సందర్శించారు. మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీ పార్లర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీపార్లర్‌లకు మంచి డిమాండ్ ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు తమ గ్రామాలకు వెళ్లిన తర్వాత స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా కుటుంబానికి ఆసరాగా నిలబడాలని సూచించారు. ఆర్ఎస్ఈటీఐ ద్వారా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ రవికుమార్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రవికుమార్, సంస్థ సిబ్బంది రామకృష్ణ, నవీన్, భాగ్యలక్ష్మి, లక్ష్మణ్, గెస్ట్ ఫ్యాకల్టీ ఫరీదా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అనుకూల సమయాల్లో పంటలు విక్రయించుకోవాలి

- ఐసీఎం హైదరాబాద్ ఉపసంచాలకుడు డా.ఎస్ శ్యాంకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంకుమార్

నిజామాబాద్ రూరల్: రైతులు పండించిన పంటలను గోదాముల్లో భద్రపరచి, అనుకూల సమయంలో మార్కెట్‌లో విక్రయించడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చునని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) హైదరాబాద్ ఉప సంచాలకుడు డా.ఎస్ శ్యాంకుమార్ పేర్కొన్నారు. మాధవనగర్‌లో గురువారం గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రైతులు, వ్యాపారులు, మిల్లర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఎం మాట్లాడుతూ వేర్‌హౌస్ రసీదుల ఆధారంగా రైతులు బ్యాంకుల నుంచి రుణ సౌకర్యాన్ని పొందవచ్చని తెలిపారు. అనంతరం రైతులను నిజామాబాద్ ఏఎంసీ, శ్రద్ధానంద్ గంజ్‌కు తీసుకెళ్లి గోదాం సదుపాయాలు, నిల్వ విధానాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎన్ శ్రీనివాసరావు, సహాయక రిజిస్ట్రార్ సరస్వతి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పీఏసీఎస్ మాధవనగర్ అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పోతరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గొడవపడ్డ నలుగురికి రూ.20 వేల జరిమానా

ఎల్లారెడ్డి: ఇంటి విషయంలో గొడవపడిన నలుగురికి రూ.20 వేల జరిమానా విధిస్తూ ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సుష్మ తీర్పు ఇచ్చినట్లు పోలీసులు గురువారం తెలిపారు. 2019లో నీల సిద్దిరాములు అనే వ్యక్తితో ఇంటి విషయంలో దండు నర్సింలు, దండు శివరాములు, దండు అంజయ్య, దండు గణేశ్‌ల మధ్య ఘర్షణ జరిగింది. ఘటనపై నీల సిద్దిరాములు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మోహన్ కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ వినోద్ కుమార్ చాకచక్యంగా వ్యవహరించి సాక్షులను సమయానికి హాజరుపర్చారు. సాక్ష్యాలు, వాదనలు విన్న అనంతరం, న్యాయమూర్తి నిందితులు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. దీంతో నిందితులు జరిమానా మొత్తాన్ని చెల్లించారు.

తప్పిన పెను ప్రమాదం



ఘటనాస్థలిలో ఆటో, ఆర్టీసీ బస్సు

బోధన్: ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం వద్ద బోధన్-నిజామాబాద్ ప్రధాన రోడ్‌లో గురువారం గ్యాస్ సిలిండర్ లోడ్‌తో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఘటనలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆర్టీసీ బస్సును ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

క్రైం కార్నర్

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: అతిగా మద్యం సేవించొద్దని భార్య మందలించినందుకు మనస్తాపం చెంది భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అర్సపల్లిలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఎనుగందులు మహేశ్(33) నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో లేబర్‌గా పనిచేసేవాడు. కొంతకాలం నుంచి మహేశ్ మద్యానికి బానిస కావడంతో భార్య తాగుడు మానుకోవాలని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన మహేశ్ బుధవారం అర్ధరాత్రి నిజామాబాద్-జానకంపేట్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు రాకను గమనించి అడ్డుగా వెళ్లడంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కళ్యాణిలో మద్యానికి బానిసై యువకుడు..



సాయిలు (ఫైల్)

ఎల్లారెడ్డి: మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన బండారి సాయిలు (42) మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎల్లారెడ్డి ఎస్సై-2 సుబ్రహ్మణ్యాచారి గురువారం తెలిపారు. మద్యానికి బానిసైన సాయిలు కుటుంబంలో బుధవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సాయిలు గురువారం వేకువజామున బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. గ్రామ శివారులోని తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కాకతీయ కాలువలో పడి యువకుడు..



షేక్ అస్గర్(ఫైల్)

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన షేక్ అస్గర్(42) ప్రమాదవశాత్తు కాకతీయ కాలువలో పడి బుధవారం మృతి చెందాడు. ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ అస్గర్ బుధవారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం కాకతీయ కాలువలో దిగాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు కాలువలో గాలింపుచర్యల చేపట్టగా గల్లంతైన చోటే మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కల్కి చెరువులో మహిళ మృతదేహం

బాన్సువాడ : పట్టణంలోని కల్కి చెరువులో గుర్తుతెలియని మహిళ (45–50) మృతదేహం గురువారం లభ్యమైంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జాలర్ల సహాయంతో మహిళ మృతదేహాన్ని బయటకి తీశారు. మెరూన్ కలర్ చీర, ఆకుపచ్చని జాకెట్ ధరించి ఉందని, గుర్తు పట్టనంతగా మృతదేహం ఉబ్బిందని సీఐ అశోక్ తెలిపారు. వివరాలకు 8712686167ను సంప్రదించాలని సూచించారు.

వరద కాలువలో వృద్ధురాలి మృతదేహం

- మోర్తాడ్ మండల నివాసిగా గుర్తింపు



ప్రభావతి (ఫైల్)


మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని నూకపల్లి శివారు వరద కాలువలో ఓ వృద్ధురాలి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతదేహం మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ప్రభావతిగా మల్యాల పోలీసులు గుర్తించారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. కామణి ప్రభావతి (66) కొంతకాలంగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. ఈ నెల 16న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులు మోర్తాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కుమారుడు శ్రీనివాస్ వెతుకుతున్నాడు. వరద కాలువలో శవం కొట్టుకురావడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. శ్రీనివాస్‌ను పిలిపించగా తన తల్లిగా గుర్తించాడు. కేసు నమోదు చేసినట్లు మల్యాల పోలీసులు తెలిపారు.

మిలిటరీ మద్యం అమ్మొద్దు.. కొనొద్దు




మాచారెడ్డి: మిలిటరీ మద్యాన్ని అమ్మినా, కొనుగోలు చేసినా నేరమేనని కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ అన్నారు. గురువారం పాల్వంచ మండలం ఆరేపల్లిలో ఒకరి ఇంట్లో నిల్వ చేసిన మిలిటరీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం నిల్వ చేసిన సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. ఈ దాడిలో ఎస్సైలు విక్రమ్, శ్రీనివాసరావు, సిబ్బంది పాషా, మైస రాజు, దేవాకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి సౌందర్యాన్ని పెంచే పండుగే బతుకమ్మ



బతుకమ్మలతో తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు



బతుకమ్మ ఆడుతున్న తెయూ మహిళా అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ, ఇది ప్రకృతి సౌందర్యాన్ని, స్త్రీల ఐక్యత, ప్రకృతి వనరుల సంరక్షణను సూచిస్తుందని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు అన్నారు. తెయూ ఉమెన్ సెల్ డైరెక్టర్ భ్రమరాంబిక ఆధ్వర్యంలో గురువారం ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ యాదగిరిరావు, అతిథిగా రిజిస్ట్రార్ ఎం యాదగిరి హాజరై బతుకమ్మలకు పసుపు, కుంకుమ సమర్పించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అంటేనే ప్రకృతిని ఆరాధించడమన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్‌ఆరతి, డీన్ ప్రొఫెసర్ కే.లావణ్య, అధ్యాపకురాళ్లు శాంతాబాయి, వాణి, ప్రసన్న శీలా, రాజేశ్వరి, జ్యోతి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ



కుర్నాపల్లిలో చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

బోధన్: ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో బుధవారం పట్టపగలే తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపిన ప్రకారం.. కుర్నాపల్లి గ్రామానికి చెందిన తులసిగారి నరేందర్ తన సతీమణితో కలిసి అత్తగారి గ్రామం మెంట్రాజ్‌పల్లికి వెళ్లారు. సాయంత్రం తన బంధువు ఫోన్ చేసి ఇంటి తాళం పగుల గొట్టబడి ఉందని తెలపడంతో వెంటనే స్వగ్రామానికి వచ్చారు. దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు, రూ.15 వేలు నగదు దోచుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఘటనా స్థలాన్ని బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై రమ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమ తెలిపారు.